తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
6 జూలై 2026
పేజీలు : 08

# గుట్ట మట్టి.. దర్జాగా కొల్లగొట్టి..






**ఎర్రమట్టి అక్రమ రవాణాతో భారీగా సొమ్ము చేసుకుంటున్న దందాగాళ్లు**

- పగలు రాత్రి తేడా లేకుండా సాగుతున్న ఎర్రమట్టి వ్యాపార
- గుట్టలపై మాఫియా కన్ను.. టిప్పర్లలో మట్టి తరలింపు
- అనుమతులు లేకుండానే ఎర్రమట్టి తవ్వకాలు స్పందించని అధికారులు
- చర్యలు తీసుకోండి.. అక్రమ మట్టి దందా ఆపాలని ఎస్సైకి గతంలో గ్రామస్తులు పిర్యాదు

నవాబుపేట్ మండల పరిధిలోని చిట్టి గీద్ద గ్రామంలో రాత్రి వేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తూ భారీగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడ్డ అక్రమార్కులు గుట్టలను పిండి చేస్తున్నారు. ప్రోక్లైనర్ల సాయంతో గుట్ట మట్టిని భారీ టిప్పర్ల తరలిస్తూ తమకు ఎవరు అడ్డు చెప్పేవారే లేరు అనే విధంగా వ్యవహరిస్తున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఎర్రమట్టి దందా నడుస్తున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల చిట్టిగిద్ద రెవిన్యూ పరిధిలోని 510 వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం చిట్టిగిద్ద గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయ సమీపంలో ప్రభుత్వ భూమి ఉంది.దానిని కొందరు రైతులకు ప్రభుత్వం సాగు చేసుకొని జీవనం సాగించామని పట్టా ఇవ్వడం జరిగింది. కానీ సాగు చేయడం చేయకుండా వదిలేశారు.ఆ ప్రభుత్వ భూమి గుట్టపై అక్రమార్కుల కన్ను పడింది. ఇక అంతే గుట్ట మట్టిని భారీ టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

నవాబుపేట్ జూలై 5( జనం సాక్షి)

లోపలి పేజీలో



## సైబరాబాద్ వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 190 మందిపై కేసులు

- మద్యం మత్తులో వాహనాలు నడిపిన ముందుకు సాగుతున్న మందుబాబులు
- 154 ద్విచక్ర వాహనాలు, 34 కార్లు, 2 ఆటోలు పట్టుబడ్డాయి
- గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు.. పోలీసుల హెచ్చరిక
- గత వారం 376 కేసులు.. జరిమానాలు, సోషల్ సర్వీస్



లోపలి పేజీలో

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి



# పుస్తకాల మోత.. ఫీజుల వాత

### మధ్యతరగతి అందని ద్రాక్ష ప్రైవేట్ విద్య

- ఇద్దరు పిల్లల్లో ఒకరు ప్రైవేటు బడికి మరొకరు ప్రభుత్వ బడికి
- చదువు కోసం మధ్యతరగతి పై అప్పుల భారం
- సుప్రీంకోర్టు నిబంధనలో అతిక్రమిస్తున్న పాఠశాలలు
- ప్రైవేట్ విద్యపై నియంత్రణ కరువు
- ఈనెల 10న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు



లోపలి పేజీలో

## ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భావ దినోత్సవాలు

- విద్య, విజ్ఞానం, నైపుణ్యాలు ఆయుధాలుగా మాదిగలు ఎదగాలి
- సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ తత్వం
- జూలై 7న గ్రామ గ్రామాన ఘనంగా వేడుకలు
- మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక విప్లవం

లోపలి పేజీలో



## ఉప్పల్‌లో రూ.89 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- చిలకానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో సీసీ రోడ్లు, సీవరేజ్ పనులు
- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మౌలిక సదుపాయాలు
- ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**ఉప్పల్, జూలై 5 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చిలకానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో సుమారు రూ. 89 లక్షల వ్యయంతో మిగితా 2లో



# గుట్ట మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న అక్రమార్కులు

**టిప్పర్ ఎర్రమట్టి 3 నుంచి 5 వేలు.**

అక్రమాలకు అలవాటు పడ్డ ఎర్రమట్టి వ్యాపారులు సెలవు దినాలే కాకుండా అన్ని రోజుల్లో తమ వ్యాపారాన్ని యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. మండలంలో రెవెన్యూ అధికారులతో ఇబ్బందులు ఉంటాయని గ్రహించిన అక్రమార్కులు సెలవు దినాలతో పాటు ఆదివారాలలో పూర్తి సమయం గుట్ట మట్టి తరలించేందుకు ప్రణాళికలు రచించుకుని ఎర్రమట్టి దందాను నిర్వహిస్తున్నారు. ఒక్కో టిప్పర్ ఎర్రమట్టిని సుమారు 3 నుంచి 5 వేల రూపాయలకు అమ్ముకుంటూ భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.

**అధికారుల నిర్లక్ష్యం!**

గత కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి దందాను భారీగా నిర్వహిస్తున్న అక్రమార్కులకు రెవెన్యూ, పోలీస్ అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పని దినాలలో కూడా అక్రమార్కులు భారీ టిప్పర్లలో ఎర్ర మట్టిని తరలిస్తున్న రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా రెవెన్యూ అధికారులు లేని సెలవు దినాల్లో పూర్తి సమయం ఎర్రమట్టి తరలింపు చేస్తున్న అక్రమార్కులను పట్టుకునేందుకు పోలీసు అధికారులు సైతం సుముఖత చూపడం లేదని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. స్థానికంగా ఉండి జిపిఓ లు ఎర్రమట్టి తరలింపు పై దృష్టి సారించి సెలవు దినాల్లో సైతం పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు అందించాల్సి ఉన్న వారి అడ్రస్ కూడా లేకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఇకనైనా అక్రమంగా మట్టి దందా నిర్వహిస్తున్న వారిపై పటిష్ట నిఘా ఉంచి రెవెన్యూ, పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలంటూ మండల ప్రజలు కోరుకుంటున్నారు

# సైబరాబాద్ వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 190 మందిపై కేసులు

**శేరిలింగంపల్లి, జూలై 5 (జనం సాక్షి):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మందుబాబుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ఎన్ని తనిఖీలు జరిగినా, ఎన్ని కేసులు నమోదు చేసినా వీకెండ్ వచ్చిందంటే 'ఫుల్లుగా మందు కొట్టు రోడ్డెక్కు' అనే నినాదంతో ముందుకు సాగుతూ వందలాది మంది డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో అడ్డంగా బుక్కవుతూనే ఉన్నారు. శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు పర్యవేక్షణలో సంబంధిత పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొత్తం 190 మందిపై కేసు నమోదు కావడం జరిగింది. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం ఏడిసిపి హనుమంతరావు నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం పోలీసులు వీకెండ్ స్పెషల్ డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులు మొత్తం 190 మంది వాహనదారులు పట్టుబడ్డారు. ఇందులో 154 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 02 మంది ఆటో రిక్షా డ్రైవర్లు, 34 మంది కార్లు, ఇతర ఫోర్ వీలర్లు నడుపుతూ పట్టుబడినట్లు తెలిపారు. ఇందులో 158 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్‌తో పట్టుబడగా, దీనిని కనిష్టంగా 36 ఎంజి/100 ఎంఎల్ నుండి 200 ఎంజి/100 ఎంఎల్ వరకు, 16 మంది 201 ఎంజి/100 ఎంఎల్ నుండి 300 ఎంజి/100 ఎంఎల్ మద్యం సేవించడం జరిగిందని, అలాగే 16 మంది 301 ఎంజి/100 ఎంఎల్ నుండి 500 ఎంజి/100 ఎంఎల్ వరకు మద్యాన్ని సేవించి పట్టుబడ్డారని ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు వివరించారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పరచనున్నట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని, ఈ నేరానికి గరిష్ట శిక్ష పది సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. గత వారం (జూన్ 29 నుండి జులై 4 వరకు) మొత్తం 376 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించడం జరిగిందని, వీరిలో 10 మందికి జరిమానా, జైలు శిక్ష, 04 గురికి జరిమానా, సోషల్ సర్వీస్, 362 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# ఉప్పల్‌లో రూ.89 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ బన్నాల గీత--ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు నిర్వహించారు. బీరప్పగడ్డ డివిజన్‌లో ప్రశాంత్‌నగర్, న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీల్లో రూ.41 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, ధర్మపురి కాలనీలో రూ.31 లక్షలతో మరో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.11 లక్షలతో బీరప్పగడ్డ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం, చిలకానగర్ డివిజన్‌లో రూ.6 లక్షలతో సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, చిలకానగర్ డివిజన్‌లో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లతో పోలిస్తే చిలకానగర్‌లో అత్యధిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, సీవరేజ్ వ్యవస్థ, కమ్యూనిటీ మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత-ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో చిలకానగర్, బీరప్పగడ్డ డివిజన్లకు భారీగా నిధులు మంజూరయ్యాయని అన్నారు. నేడు చిలకానగర్ అభివృద్ధి పరంగా ముందంజలో ఉండడానికి ఎమ్మెల్యే సహకారం ప్రధాన కారణమని కొనియాడారు. డివిజన్‌లో ఇంకా మిగిలిన వీధుల్లో సీసీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి పనులను కూడా ఎమ్మెల్యే సహకారంతో దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. చిలకానగర్, బీరప్పగడ్డ డివిజన్ల ప్రజల తరఫున ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి బన్నాల గీత-ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్ నగర్, జూలై 5 (జనం సాక్షి) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్-208ను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో నిర్ధారించుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకునేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని కళ్లెం నవజీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) శ్రీరాములు, బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్ ఎ) శ్రీకాంత్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# 40 ఏళ్ల సేవకు దక్కిన గౌరవం

- కార్యకర్త నుండి చైర్మన్ వరకు చెన్నారం అనిల్
- యాలాల్ మండల సహకార బ్యాంక్ చైర్మన్‌గా చెన్నారం అనిల్ నియామకం

యాలాల జులై 5(జనంసాక్షి) : 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన సీనియర్ నేత, యాలాల మండల కాంగ్రెస్ పార్టీలో కీలక వ్యక్తి అయిన చెన్నారం అనిల్ ను పార్టీ పెద్దలు గుర్తింపు ఇచ్చారు. కింది స్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీ కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన అనిల్ కుమార్ యాలాల్ మండల సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ పదవి దక్కింది.

పార్టీలో ఎదురైన ఎన్నో ఒడిదుడుకులను, ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచిన ఆయన, ఒకానొక సందర్భంలో యాలాల మండలంలో కాంగ్రెస్ పార్టీని, పార్టీ కార్యకర్తలను అన్నీ తానై కాపాడుకున్నారు. నలభై సంవత్సరాలుగా కాంగ్రెస్ వాదిగా కొనసాగుతూ పార్టీకి ఎన్నో సేవలు అందించారు. ఆయన త్యాగానికి, నిబద్ధతకు ఫలితంగా ఈ పదవి దక్కిందని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

అనిల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టబోతున్న శుభ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో మండలంలో సహకార సంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

# పుస్తకాల మోత.. ఫీజుల వాత

- మధ్యతరగతి అందని ద్రాక్ష ప్రైవేట్ విద్య
- ఇద్దరు పిల్లల్లో ఒకరు ప్రైవేటు బడికి మరొకరు ప్రభుత్వ బడికి
- చదువు కోసం మధ్యతరగతి పై అప్పుల భారం
- సుప్రీంకోర్టు నిబంధనలో అతిక్రమిస్తున్న పాఠశాలలు
- ప్రైవేట్ విద్యపై నియంత్రణ కరువు
- ఈనెల 10న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు




వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 5 (జనం సాక్షి): ప్రస్తుత సమాజంలో విద్య వ్యాపారంగా మారింది. ఎల్కేజీ పిల్లలకు లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలో వేరే చెప్పనక్కర్లేదు. ఫీజుల దోపిడీ ఆకాశాన్ని తాకుతుండడంతో సామాన్య మధ్యతరగతి పిల్లల తల్లిదండ్రులు పరిస్థితి అగమ్యగచరంగా తయారైంది. తమ పిల్లలకు మంచి విద్య అందించాలని కలలుగన్న తల్లిదండ్రులకు అందని ద్రాక్షగా మారింది. ఉన్నత చదువుల కోసం అప్పుల పాలు అవుతుండడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నేటి సమాజంలో పిల్లలను చదివించడం పెద్ద సవాలుగా మారింది. చదువుల కంటే అప్పుల భారం ఎక్కువగా ఉంది. మంచి భవిష్యత్తు కోసం పిల్లలను పాఠశాలకు పంపితే ఆ ఖర్చులు మధ్యతరగతి జీవితాలను కుదిపి వేస్తున్నాయి వివరాల్లోకి వెళితే. వికారాబాద్ జిల్లాలో పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల మోత మోగుతుంది. అంతే కాకుండా పాఠ్యపుస్తకాలను అధిక రేటుకు రహస్యంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం మునుపెన్నడు లేని విధంగా ఆన్ లైన్ లో పాఠ్యపుస్తకాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. విద్యార్థి సంఘాలు ప్రైవేట్ పాఠశాలల ముందు ధర్నాలు చేయడంతో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం పుస్తకాల వ్యాపారాన్ని మరో విధంగా మార్చింది. రహస్యంగా పాఠ్యపుస్తకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందించి ఆన్ లైన్ లో పేమెంట్ పొందుతున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన విద్యార్థి సంఘాలు కొన్ని విద్యాసంస్థల ముందు ఆందోళనకు దిగి యాజమాన్యాన్ని నిలదీశాయి. తక్షణమే ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే విద్యార్థులకు ఎల్ కేజీ నుంచి పుస్తకాల మోత మోగుతుంది. పిల్లలు పుస్తకాల సంచి మోయలేక నానా అవస్థలు పడుతున్నారు. చిన్న పిల్లలకు సైతం కొన్ని కేజీల్లో పుస్తకాలు ఉంటున్నాయి. పుస్తకములకు తగ్గట్టు వారి ప్రైవేట్ స్కూల్ ఫీజు అధికంగా ఉంటుంది. ఒక ఇంట్లో ఇద్దరు పిల్లలను చదివించాలంటే వాళ్ళ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారాన్ని తట్టుకోలేక ఒక విద్యార్థిని ప్రైవేట్ లో చదివిస్తే మరో విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలని చిన్న మధ్య తరగతి కుటుంబాలకు ప్రైవేట్ విద్య అందని ద్రాక్షగా తయారైంది. వారి పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలని తన కలలు నెరవేరే పరిస్థితి లేదు. ఒకరి ఇంట్లో ఇద్దరు ఉద్యోగస్తులు అయితే వారు ఇద్దరు పిల్లలను ప్రైవేటు పాఠశాలలు చదివించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రైవేట్ విద్యపై నియంత్రణ లేదు. ప్రైవేట్ విద్యను నియంత్రించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం బెడిసి కొడుతుంది. ప్రతి ఏడాది జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటికి అనుమతులు ఉన్నాయా లేవా అనుమతులు ఉంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరని విధంగా అధికారులు ఎందుకు అనుమతులు ఇస్తున్నారని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఒకటవ తరగతి నుంచి ఆరవ తరగతి వరకు ఆధార్ కార్డు లేకుండా విద్యార్థులను పాఠశాల లో చేర్చుకోవలసిన అవసరం ఉంది. కానీ జిల్లాలో అలా జరగడం లేదు. ఎల్ కేజీ నుంచి విద్యార్థులకు ఆధార్ కార్డు వివరాలను నమోదు చేస్తున్నారు. ఆధార్‌కార్డు అడిగితే కోటి రూపాయల జరిమానా విధించవచ్చునని సుప్రీంకోర్టు ఇచ్చినా రూలింగ్ బేఖాతరు అవుతుంది. ప్రతి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల తరహాలో కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలలను స్థాపించి ఎల్కేజీ నుంచే అన్ని వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ పెరుగుతుంది. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో విద్యను బలోపితం చేస్తే అప్పుడే తెలంగాణలో బంగారు భవిష్యత్తు విద్యార్థులకు అందుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొన్ని సర్వేల ప్రకారం 52 శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటే 48 శాతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25% రాయితీ ఇచ్చి చదివించే పిల్లల సంఖ్య క్రమంగా తగ్గుతుంది. విద్యార్థులకు రాయితీ కింద అడ్మిషన్ ఇచ్చిన ఫీజుల మాదిరిగా కాకుండా మరో రూపకంగా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తుంది. విద్య వ్యవస్థలో సమన్వయ విద్య లేని కారణంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజులు జులుం ప్రభుత్వ హాస్టల్లో రెసిడెన్షియల్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తగిన బోధన సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఈనెల 10వ తేదీన అన్ని విద్యార్థి సంఘాలు పాఠశాలల బంద్ కు పిలుపునిచ్చాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ పాఠ్యపుస్తకాల వ్యాపారంపై తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తారని ఆశిద్దాం.....

# ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భావ దినోత్సవాలు

**షాద్‌నగర్, జూలై 5 (జనం సాక్షి):** సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ తత్వమని, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించడమే కాక తమ పోరాటాల ద్వారా సమాజానికి అనేక సంక్షేమ ఫలితాలను అందించి రేపటి తరాల భవిష్యత్తుకు చెరగని చరిత్రను నిర్మించిన ఎమ్మార్పీఎస్ జెండాను ప్రతి గ్రామంలో ఎగరవేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు.

షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, తరతరాలుగా విద్యాపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా వెనకబాటుతనానికి గురైన మాదిగ ప్రజలు విద్య, విజ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకతలను ఆయుధాలుగా చేసుకొని అన్ని రంగాల్లో ఎదగడానికి నడుం బిగించాలని కోరారు.

మాదిగల కోసం ముప్పై ఏళ్లుగా జరిగిన రాజీలేని పోరాటం విజయవంతమై తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతోందని అన్నారు. ఈ విజయానికి కారణం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు అందించిన సహకారమే అని పేర్కొన్నారు. దేశంలో ఎన్నో కుల ఉద్యమాలు పుట్టినప్పటికీ లక్ష్యం సాధించే వరకు ఏ ఉద్యమం నిలబడలేకపోయాయి కానీ ఎమ్మార్పీఎస్ మాత్రమే సజీవంగా నిలబడి లక్ష్యం చేరిందని దానికి సమాజం ఇచ్చిన సహకారమే ప్రధాన కారణమని అన్నారు.జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావమే కాదు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ జన్మదినం కాబట్టి వారి జన్మదిన వేడుకలు ఘనంగా జరపాలని కోరారు. విద్యా ప్రాముఖ్యత మా సంఘ ప్రజల్ని చదువుపట్ల చైతన్యం చేస్తున్న మనం ప్రస్తుతం టెన్త్, ఇంటర్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించాలని కోరారు. విద్య ద్వారానే విముక్తి సాధ్యం కాబట్టి మన వర్గాల ప్రజల్ని విద్యపై చైతన్యం చేయాలని గుర్తు చేశారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయించిన సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేలో తెలంగాణలో అత్యధిక పేదరికం కలిగి ఉన్న కులంగా మాదిగలే ఉన్నారని తేలిందని, అలాగే భూమిలేని వారిలో, ఆస్తులు లేని వారిలో, రోజువారి కూలి పని చేసుకుంటున్న వారిలో మాదిగలే మొదటి స్థానంలో ఉన్నారని స్పష్టంగా బయటపడిందని అన్నారు. అందువల్ల పేదరికం, వెనుకబాటుతనం, నిరక్షరాస్యతను తొలగించుకోవడం కోసం, సామాజిక అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా మాదిగ జాతి ఐక్యమత్యంతో ముందుకు సాగాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో నాగభూషణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ ఫరూఖ్ నగర్ మండల అధ్యక్షులు, చిర్ర శీను మాదిగ కేశంపేట్ మండల అధ్యక్షులు, చెన్నగల్ల అశోక్ మాదిగ నందిగామ మండల ఇన్‌చార్జ్, బొబ్బిలి పాండు మాదిగ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు, ఎర్రోళ్ల సురేష్ మాదిగ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కడుమూరు సాయి మాదిగ, నందిగామ మండల కో-ఇన్‌చార్జ్, సంగం శీను మాదిగ, చింతగూడెం శివ మాదిగ, జాంగారి రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ పోలీస్ అధికారి కె.బ్రహ్మానాయుడుకు సన్మానం

- **హాజరైన తెలంగాణ ప్రదేశ్ పోలీస్ సంఘం మాజీ ఉపాధ్యక్షులు గోవిందరావు**



**ఖైరతాబాద్, జూలై 05 (జనంసాక్షి):** పోలీస్ శాఖలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించి ఇటీవల పదవీ విరమణ పొందిన కె.బ్రహ్మ నాయుడు కు ఘన సన్మానం ఆదివారం నిర్వహించారు.తెలంగాణ ప్రదేశ్ పోలీస్ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కె గోవిందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహోద్యోగులు, స్నేహి తులు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. కె.బ్రహ్మనాయుడు 1989లో పోలీస్ శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, జూన్ 30న పదవీ విరమణ పొందారని తెలిపారు. సుమారు 38 ఏళ్ల పాటు వివిధ విభా గాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి, తన క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజాసేవా దృక్పథంతో ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు.పోలీస్ శాఖలో వివిధ బాధ్యతలు నిర్వహించిన బ్రహ్మ నాయుడు చివరిగా ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ విభా గంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందా రని తెలిపారు.ఆయన సేవలు శాఖకు ఆదర్శంగా నిలిచాయని, యువ పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదా యకమని గోవిందరావు అన్నారు.సన్మాన కార్యక్ర మంలో తోటి సహోద్యోగులు ఆదినారాయణ రెడ్డి, సంపత్, బి. వీరప్ప తదితరులు పాల్గొని బ్రహ్మ నాయుడికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అంద జేసి ఘనంగా సత్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ఆయన చూపిన అంకితభావం, సహోద్యోగులతో కలిసిమెలిసి పనిచేసిన తీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. సన్మానానికి స్పందించిన బ్రహ్మనాయుడు తనకు సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ జీవితంలో అందరి సహకారంతోనే విజయవం తంగా సేవలందించగలిగానని పేర్కొన్నారు.

# ఎల్లమ్మ తల్లి దేవాలయ భూమిని కాపాడాలని దళితులు న్యాయపోరాటం

- **కబ్జాకోరుల నుండి కాపాడమన్నందుకు 12 మంది దళిత కుటుంబాలపై అక్రమ కేసులు**
- **ఎల్లమ్మ తల్లి సంబంధించిన భూములను కాపాడాలని పోరాటం చేస్తున్న దళితులు**




**ఆమనగల్ జూన్ 05(జనంసాక్షి):**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మున్సిపాలిటీ ఐదో వార్డ్ నవ చైతన్య కాలనీ సందబాయి సమీపంలో ఉన్న గ్రామకంతానికి సంబంధించిన టువంటి భూమిలో తరాల నుండి ఎల్లమ్మ తల్లి ఆరాధ్య దైవంగా దళిత కుటుంబాలు కొలుస్తున్నటువంటి దేవాలయాన్ని కొంతమంది. భూకబ్జాదారులు ఉద్దేశపూర్వకంగా ఆక్రమించాలని చూస్తున్న విషయం పై దళిత కుటుంబాలు ఎల్లమ్మ దేవాలయ స్థలంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.కొల్లూరు కృష్ణాదేవి ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు 12 మంది దళిత కుటుంబాలపై నమోదు చేయించి సంవత్సర కాలంగా అమాయక కుటుంబాలను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందని తెలిపారు.గ్రామ కంఠంలో ఉన్నటువంటి సందబావి ఆమనగల్ గ్రామ ప్రజలకు పూర్వం నుండి మంచినీటి సౌకర్యార్థం సర్కారు బావిగా వినియోగంలో ఉండేదని ఈ యొక్క భూమి కాలక్రమేనా గ్రామంలో ఉన్నటువంటి వృద్ధాల ద్వారా పుర్చి వేయడం జరిగింది. దళితులు ఆరాధిస్తున్నటువంటి ఎల్లమ్మ తల్లి దేవాలయానికి సంబంధించిన భూమిని కాపాడాలని న్యాయపరమైన పోరాటంలో ఎంతటి త్యాగానికైనా సిద్ధమని నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మార్పీఎస్ ఆమనగల్ మండల అధ్యక్షులు కావలి శ్రీశైలం,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లండం జంగయ్య కందుకూరు డివిజన్ ఎస్సీ,ఎస్టి అట్రాసిటీ విజిలెన్స్‌డ మానిటరింగ్ కమిటీ సభ్యులు జంతుక శంకర్ మాట్లాడుతూ..కల్వకుర్తి నియోజకవర్గంలో దళితులపై దాడులు నిత్యకృత్యమైతున్నాయని హిందూ సాంప్రదాయంలో ఆరాధిస్తున్న ఎల్లమ్మ దేవాలయ భూములను కబ్జా చేసే కుట్రలో భాగంగా దళితులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు.దళిత వ్యతిరేక విధానాన్ని ఉపసంహరణ చేసుకోకపోతే ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు వస్పుల సురేష్, కోశాధికారి కొమ్ము శ్రీశైలం, వస్పుల శేఖర్,ప్రదాన కార్యదర్శి మీసాల రమేష్ ,జాయింట్ సెక్రటరీ అప్సర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. జంతుక కిరణ్, శివ, కృష్ణ, శేఖర్, శ్రీశైలం, రాములమ్మ, వెంకటమ్మా, ఎల్లమ్మ, రాంచంద్రమ్మ, యాదమ్మ,బాల్ రాం,రాజు,తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా క్యూర్ బిల్లు - 2026 పై ప్రజాభిప్రాయాలను స్వాగతించిన సిఎంసి

**శేరిలింగంపల్లి, జూలై 05 (జనంసాక్షి) :** ముసాయిదా కోర్ అర్బన్ రీజియన్( ఇంటిగ్రేటెడ్ గవెర్నెన్స్) బిల్లు - 2026పై ప్రజాభిప్రాయాలు మరియు సూచనలను ఆహ్వానిస్తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ముసాయిదా బిల్లును పౌరులు, ప్రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పరిశ్రమల ప్రతినిధులు, వృత్తిపరమైన నిపుణులు, ఇతర భాగస్వామ్య వర్గాల అభిప్రాయాలు, సూచనలు కోరుతూ బిల్లును ప్రజాక్షేత్రంలో ఉంచినట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ ముసాయిదా బిల్లును పరిశీలించి తమ యొక్క విలువైన సూచనలు, సలహాలను మరియు అభిప్రాయాలను ఈ నెల 24వ తేదీ లోపు పంపించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముసాయిదా బిల్లు మరియు సూచనలు సమర్పించేందుకు https://ghmc.gov.in/categoryWiseInsertReport.aspx లింకు ద్వారా పబ్లిక్ డొమైన్ లోకి ప్రవేశించి దానిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి వారికి తోచిన సలహాలు సూచనలను అందులో పొందుపరిచి తగిన చిరునామా, ఇతర కమ్యూనికేషన్ విధానాలను జోడించి పంపాల్సిందిగా అధికారులు కోరుతున్నారు. ఈనెల 24 దాటిన తర్వాత సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి ప్రజల నుండి అందిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి ప్రజల అవసరాలకు అనుగుణంగా మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రజా కేంద్రీకృత పట్టణ పరిపాలన వ్యవస్థను వారి కోసం రూపొందించి అమలుపరచడం ద్వారా సైబరాబాద్ పరిధిలో అత్యంత నాణ్యమైన జీవన విధానానికి శ్రీకారం చుట్టాలన్నదే ముసాయిదా క్యూర్ బిల్లు - 2026 యొక్క లక్ష్యం అని అధికారులు స్పష్టం చేశారు.

# తార్నాక స్ట్రీట్ నెం.3 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీరామ్ వెంకటేష్



**సికింద్రాబాద్(జనంసాక్షి):** తార్నాక స్ట్రీట్ నెం.3 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ సామాజిక సేవకుడు, బీజేపీ నాయకుడు డాక్టర్ శ్రీరామ్ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా అడ్వకేట్ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా మధు, కోశాధికారిగా మహ్మద్ అస్లాం పాషా, కార్యవర్గ సభ్యులుగా వెంకట సుబ్బారావు, జాయ్, మెర్సీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ శ్రీరామ్ వెంకటేష్ కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలను ప్రకటించారు. గత రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురై అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిన పార్కును తన సొంత నిధులతో అభివృద్ధి చేసి ఆయుర్వేద పార్కుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కాలనీ సమస్యల డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సమస్యలను నివాసితులు లిఖితపూర్వకంగా తెలియజేస్తే సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి నెలా కాలనీ న్యూస్ లెటర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని సుమారు 280 ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సంస్థలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల ప్రతినిధులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ నాయకత్వంలో తార్నాక స్ట్రీట్ నెం.3 ఆదర్శ కాలనీగా అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని కాలనీ వాసులు వ్యక్తం చేశారు.

# మూడుచింతల పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఎంసీ పల్లి-లక్ష్మాపూర్ ప్రధాన రహదారిపై నిర్మించాలి

## యువ నాయకుడు క్యాతం మధు క్రిష్ణ

**శామీర్ పేట, జులై 05(జనం సాక్షి) :** మూడుచింతల పల్లి మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి అధికారులు ప్రస్తుతం పరిశీలించిన స్థలం ఎంఆర్ఓ కార్యాలయం పక్కన, ప్రధాన రహదారికి లోపల ఉండటంతో పాటు సమీపంలో అంగడి మార్కెట్ కూడా ఉంది. దీంతో భవిష్యత్తు లో ట్రాఫిక్ రద్దీ, వాహనాల పార్కింగ్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని లక్ష్మాపూర్ గ్రామ యువ నాయకుడు క్యాతం మధు క్రిష్ణ తెలిపారు.ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా, భవిష్యత్తు అవసరా లను దృష్టిలో ఉంచుకుని ఎంసీ పల్లి-లక్ష్మాపూర్ ప్రధాన రహదారిపై విశాలమైన స్థలంలో మూడు చింతల పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించా లని ఆయన ప్రభుత్వం, జిల్లా అధికారులను కోరారు. ప్రధాన రహదారిపై మున్సిపల్ కార్యాలయం నిర్మిస్తే ప్రజలకు రాకపోకలు సులభ మవుతాయని, అత్యవసర సేవలకు అనుకూలంగా ఉండటంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. భవిష్యత్తులో మున్సిపాలిటీ విస్తరణ, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థల ఎంపికలో దూరదృష్టితో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై త్వర లోనే మూడుచింతల పల్లి మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించి, ప్రజల అభిప్రాయాన్ని తెలియజేస్తామని క్యాతం మధు క్రిష్ణ తెలిపారు.

# రైతుల కోసం యాప్ కాదు.. గిట్టుబాటు ధర ఇవ్వండి

**సిపిఎం మండల కార్యదర్శి బోడ మల్లేశం**





**శంకర్‌పల్లి, జూలై 5(జనం సాక్షి) :** యూరియా కోసం రైతులతో యాప్‌ల పేరుతో ఇబ్బంది పెట్టడం మాని,రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి బోడ మల్లేశం డిమాండ్ చేశారు.రాజకీయ నాయకులకు లేని యాప్‌లు యూరియా కోసం రైతులకు ఎందుకు?ప్రభుత్వానికి చేతనైతే రైతులకు సగం ధరకే యూరియా అందించండి.అంతేకానీ అనవసర యాప్‌లు తీసుకువచ్చి రైతులను ఇబ్బంది పెట్టకూడదని ఇలాగే రైతులను ఇబ్బంది పెడితే రైతులే ప్రభుత్వాన్ని బొంద పెడతారని ఈ సందర్భంగా ఆయన అన్నారు.
ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఈ విధంగా యాప్లు తీసుకు రాలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం యాప్ పేరున కాలయాపన చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతోందని ఈసందర్భంగాతెలియజేశారు.నిజంగా రైతులు బాగుపడాలని కోరుకుంటే రాజకీయ నాయకుల ఆస్తుల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో ఉంచాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ గృహప్రవేశాన్ని ప్రారంభించిన శాంత్ కుమార్



**దోమ జులై 05 జనంసాక్షి :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటి కలను నెరవేస్తున్నదని దోమ మండల పార్టీ అధ్యక్షులు శాంత్ కుమార్ అన్నారు. ఆదివారం నాడు దోమ మండల పరిధిలోని గొట్లచెల్క తాండ గ్రామపంచాయతీలో బామిని బాయ్ ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాల్గొని రిబ్బన్ కట్ చేసి గృహ ప్రారంభం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఇండ్లు కేటాయించలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పేదలకు ఇంటి కలను నెరవేర్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరణ చూరగొంటుంది అని అన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత చందర్ నాయక్, సొసైటీ చైర్మన్ ఆగిరాల యాదవ రెడ్డి,దోమ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల రాఘవేందర్ రెడ్డి, తండావాసులు రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రజలకు సహకారం అందిస్తున్న ది సిటీజన్స్ కౌన్సిల్



**రాజేంద్రనగర్, జూలై5 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయ ఆదేశాల మేరకు నార్సింగి మున్సిపల్ సర్కిల్‌లో జరుగుతున్న సమగ్ర ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమంలో ప్రజలకు సహకారం అందించేందుకు ది సిటీజన్స్ కౌన్సిల్ సభ్యులు ముందుకు వచ్చారు. బీఎల్‌వోలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రజలకు సేవలు సకాలంలో చేరని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ మహమ్మద్, అనుకపూర్, దిలీప్ తదితరులు అర్హులైన ఓటర్లకు ఓటరు నమోదు, సవరణలకు సంబంధించిన సేవలను స్వచ్ఛందంగా అందిస్తున్నారు. దీనితో స్థానిక కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేజీబీవీలో గ్రూపు తగాదాలకు చెక్..!

- విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేయాలి : మండల విద్యఅధికారి ఎంఈవో,రాజునాయక్
- సమన్వయంతో పనిచేయాలని కేజీబీవీలో బోధించే వారికి విద్యాధికారి సూచన
- మళ్లీ విభేదాలు తలెత్తితే సిబ్బందిని జిల్లా కార్యాలయానికి సరెండర్ చేస్తామని హెచ్చరిక

**మహ్మదాబాద్,జూలై 04 (జనంసాక్షి):**
మండల పరిధిలోని కేజీబీవీ బాలికల విద్యాలయాన్ని శనివారం మండల విద్యాధికారి(ఎంఈవో)రాజు నాయక్ సందర్శించి.పాఠశాల పరిస్థితులను పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులందరూ గ్రూపు తగాదాలు,వ్యక్తిగత విభేదాలను పూర్తిగా పక్కనపెట్టి సమన్వయంతో పనిచేయాలని ఎంఈవో స్పష్టం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రతి ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఇటీవల పత్రికల్లో





ప్రచురితమైన అంశాలపై కూడా సిబ్బందితో చర్చించిన ఎంఈవో,పాఠశాల ప్రతిష్ఠకు భంగం కలిగించే సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ,ఎలాంటి భేదాభిప్రాయాలకు తావు ఇవ్వకుండా విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా కొనసాగించాలని సూచించారు.

**విద్యాలయలో మరోసారి సిబ్బంది మధ్య గ్రూపు తగాదాలు వద్దు**

విభేదాలు ఉన్నట్లు తమ దృష్టికి వస్తే ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు.అవసరమైతే సంబంధిత ఉపాధ్యాయులందరినీ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సరెండర్ చేయాల్సివస్తుందని స్పష్టం చేశారు.కేజీబీవీ పాఠశాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో విశ్వాసం మరింత పెరిగేలా ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంఈవో రాజు నాయక్ సూచించారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎంఈఓ, రాజునాయక్,కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

# గుంతల రోడ్డుతో నిత్యం ప్రాణభయం

- చెంగిచెర్ల క్రాంతి కాలనీ-అరవింద కాలనీల మధ్య అధ్వాన్న రహదారి
- వర్షాకాలంలో మరింత దుర్భరంగా మారిన పరిస్థితి
- వేలకు వేలు పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాలు ఎక్కడని స్థానికుల ప్రశ్న
- తక్షణమే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి

**చెంగిచెర్ల, జూలై 5 (జనంసాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల క్రాంతి కాలనీ--అరవింద కాలనీల మధ్య ఉన్న ప్రధాన రహదారి భారీ గుంతలతో పూర్తిగా దెబ్బతిని ప్రజలకు నిత్యం ప్రాణసంకటంగా మారింది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి క్రాంతి కాలనీ, పెద్ద క్రాంతి కాలనీ నుంచి అరవింద కాలనీ, రామకృష్ణ కాలనీ, చిన్న క్రాంతి కాలనీ, జయశ్రీ కాలనీ, జయప్రద కాలనీలను అనుసంధానించే ప్రధాన మార్గం. ప్రతిరోజూ వందలాది మంది ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు, పాఠశాల బస్సులు, విద్యార్థులను తీసుకెళ్లే వ్యాన్లు ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటాయి. అయితే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో, వర్షం సమయంలో గుంతలు నీటితో






నిండిపోవడంతో అవి కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు స్వల్ప ప్రమాదాలకు గురైనట్లు పేర్కొంటున్నారు. “వేలకు వేలు ఆస్తి పన్నులు, ఇతర మున్సిపల్ పన్నులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. అయినా కనీసం ప్రయాణించేందుకు పనికొచ్చే రహదారి కూడా లేకపోతే పన్నులు చెల్లించడం వల్ల ప్రజలకు ప్రయోజనం ఏమిటి?” అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్, మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

## యాలాల మండలంలో జూలై 7న ఎంఆర్ పిఎస్ ఆవిర్భావ దినోత్సవం



**యాలాల జులై 5 ( జనంసాక్షి ) :** ఎంఆర్ పిఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం మరియు ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను జూలై 7 మంగళవారం నాడు యాలాల మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఎంఆర్ పిఎస్ యాలాల్ మండల కమిటీ పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడు మరియు ఇంచార్జ్ మెట్లీ సూర్యప్రకాష్ మాదిగ మాట్లాడుతూ ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు యాలాల మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలోనూ ఎంఆర్ పిఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పల్లెల్లో సంప్రదాయబద్ధంగా దండోరా పండుగ తరహాలో ఈ కార్యక్రమాలను జరుపుకోవాలని మండల కమిటీ పక్షాన విజ్ఞప్తి చేశారు. అదే రోజు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను కూడా ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని కోరారు.సామాజిక ఉద్యమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని మెట్లీ సూర్యప్రకాష్ మాదిగ పిలుపునిచ్చారు.

# ‘ఓటు’ మన ఆయుధం

## బోడుప్పల్లో 385వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల

### ప్రతి భారతీయుడు ఓటు హక్కును కలిగి ఉండాలి
### ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి
### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు



**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 385వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా భారతీయులకు కల్పించిన వజ్రాయుధం “ఓటు” హక్కు అని,కుల, మత, ధనిక, పేద అనే వర్గ విభేదాలు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని, ఓటు ద్వారానే ప్రజలకు సేవ చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటామని, ముఖ్యంగా దళిత, బహుజనులు, బడుగు, బలహీన వర్గాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని, ప్రతి ఒక్కరు నిజాయితీ గల నిజమైన, ప్రజా సేవకులకు ఓటు వేసినప్పుడే అనే వర్గాల అభివృద్ధి చెందుతాయని ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని, ప్రతి ఒక్కరు తమ హోటల్ హక్కును వినియోగించుకోవడం బాధ్యతగా భావించాలని అన్నారు. పారదర్శకంగా అర్హుడైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఓటు హక్కును పొందుపరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, శ్రీరాముల జ్ఞానేశ్వర్, రాపోలు వెంకటేష్, సాయి బండారి, మేడే శ్రీకాంత్, ఏసు రాజు, జడ శ్రీనివాస్, బొట్టు శీను, కిషోర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద మనసు చాటుకున్న ఎన్కేపల్లి గ్రామ యువకులు



**మోమిన్ పేట జూలై 05 ( జనం సాక్షి) :** రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకున్న గ్రామస్తులు పెద్ద మనసుతో ఎందుకు వచ్చిన యువకులను అభినందించిన మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు కొసిగి సురేందర్ ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి ఎన్కేపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు తండ్రి చంద్రయ్య రైలు ప్రమాదంలో మృతి చెందారు ఆయనకు భార్య ప్రవీణ ఇద్దరు పిల్లలు అనాథలైనారు వారి కుటుంబానికి మానవతా దృక్పథంతో ఎన్కేపల్లి 7 వ వార్డ్ సభ్యుడు కిందింటి అనిల్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో సహాయం కొరకు వాట్సాప్ లో మెసేజ్ పెట్టడంతో ఎన్కేపల్లి గ్రామానికి చెందిన యూత్ మరియు పెద్దలు వారికి తోచిన రీతిలో 46,700 నగదు ను మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు ఎన్కేపల్లి గ్రామ సర్పంచ్ కోస్గి సురేందర్ ఉపసర్పంచ్ అబ్దుల్ మనన్ సమక్షంలో కుటుంబానికి అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి , కోస్గి దుర్గయ్య ,దనుగారి నర్సింలు, దాసరి రామచంద్రయ్య ,దాసరి అనిల్ కుమార్ ,పడేలా సంపత్, ధన్గిరి విద్యాసాగర్, తవెర రాజు, కావలి బాలరాజు ,గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు

# పల్లె పల్లెలో ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలి

- రాజకీయాలకతీతంగా మాదిగ జాతి ఐక్యమత్యంతో ముందుకు సాగాలి
- విద్యా, విజ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకతలను ఆయుధాలుగా చేసుకొని మాదిగ యువత అన్ని రంగాల్లో ఎదగాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ



**తలకొండపల్లి న్యూస్ 05 (జనంసాక్షి):** వేల సంవత్సరాలుగా విద్యాపరంగా,సామాజికంగా,సాంస్కృతికంగా,ఆర్థికంగా వెనకబాటుతనానికి గురైన మాదిగ ప్రజలు విజ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకతలను ఆయుధాలుగా చేసుకొని అన్ని రంగాల్లో ఎదగడానికి నడుం బిగించాలని, జులై 7 ఎమ్మార్పీఎస్ 32,వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీ వర్గీకరణ విజయ ఫలాలను మన జాతులకు అందించి చెరగని చరిత్రను నిర్మించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ జెండాను గ్రామ గ్రామాన ఎగరవేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు.తల్లకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశాన్ని మండల అధ్యక్షులు తుడుం శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగతో కలిసి ముఖ్య అతిథిగా రాగల్ల ఉపేందర్ మాదిగ పాల్గొని మాట్లాడారు.పాలకులు,ప్రతిపక్షాలు విస్మరించిన అంశాలను,రాజకీయ పార్టీలు పట్టించుకోని సమస్యలను ప్రధాన ఎజెండాగా చేసుకుని ప్రజల కోసం పోరాటం చేసిన అతిపెద్ద సామాజిక ఉద్యమం,మూడు దశాబ్దాలుగా నేటికీ ప్రజల హృదయాల్లో సజీవంగా జీవించి ఉన్న ఏకైక ఉద్యమం ఎమ్మార్పీఎస్ అని అన్నారు.మూడు దశాబ్దాల పాటు రాజీ లేని పోరాటం చేసి’పద్మశ్రీ’ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణను సాధించి పెట్టాడని అన్నారు.ఎస్సీ వర్గీకరణ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు అందుతున్న 9 శాతం రిజర్వేషన్లను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని విద్యా ,ఉద్యోగాలలో రాణించాలని అన్నారు.మాదిగల్లో అక్షరాస్యత తక్కువగా ఉన్నందున ఇకపై ఎవరు చదువులకు దూరం కావద్దని అన్ని మార్గాలను ఉపయోగించుకొని ప్రాథమిక విద్యా,మాధ్యమిక విద్య,ఉన్నత విద్యలో ముందుకు సాగాలని అన్నారు.వివిధ కారణాలవల్ల చదువులకు దూరమైన విద్యార్థిని విద్యార్థులు తక్షణమే బడి బాట పట్టాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు విద్యా, ఉద్యోగ,సామాజిక ,ఆర్థిక,వ్యాపార,రాజకీయ మొదలగు రంగాల్లో ప్రథమ స్థాయిలోకి చేరుకోవడానికి ఇప్పటినుండి తీవ్రంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయించిన సామాజిక, ఆర్థిక,కుల గణన సర్వేలో తెలంగాణలో అత్యధిక పేదరికం కలిగి ఉన్న కులంగా మాదిగలే ఉన్నారని తేలిందని,అలాగే భూమిలేని వారిలో ఆస్తులు లేని వారిలో మరియు రోజువారి కూలి పని చేసుకుంటున్న వారిలో మాదిగలే మొదటి స్థానంలో ఉన్నారని స్పష్టంగా బయటపడిందని అన్నారు. అందువల్ల పేదరికం,వెనుకబాటుతనం,నిరక్షరాస్యతను తొలగించుకోవడం కోసం,సామాజిక అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా మాదిగ జాతి ఐక్యమత్యంతో ముందుకు సాగాలని అన్నారు.అందులో భాగంగా మందకృష్ణ మాదిగ నడుపుతున్న ప్రతి పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మాదిగ జాతి కోసం మొదలైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం,మాదిగల వరకే పరిమితం కాలేదని సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాలకులతో పోరాడి అనేక సంక్షేమ ఫలితాలను ప్రజలకు అందించి పెట్టిన చరిత్ర ఎంఆర్పిఎస్ కు ఉన్నదని,అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ,వృద్ధాప్య,వికలాంగ పెన్షన్,రేషన్ కోట బియ్యం పెంపు,ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తదితర పథకాలు సాధించిపెట్టిందని ఇవన్నీ సమాజం కోసం చేసినవని గుర్తించుకోవాలని కోరారు. 32వ వసంతంలోకి చేరుకుంటున్న సందర్భంగా జులై 7న మాదిగల జెండా పండుగగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి సంబరాలను అంబరాన్ని అంటే విధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీకాంత్ మాదిగ,మండల కార్యదర్శి మీసాల మహేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలస్వామి, రాములు, పరమేష్, శ్రీను, నర్సింహ్మా, రాజు, ఉదయ్ కిరణ్, శ్రీను, శ్రీకాంత్, సింహాద్రి, రాజు, శ్రీను తదతరులు పాల్గొన్నారు.



## బంట్వారం మండలంలో బొపునారం గ్రామంలో అభివృద్ధి పనులు పరిశీలన

**బంట్వారం, జులై 05 జనంసాక్షి :** బంట్వారం మండల పరిధిలోని బోపునారం గ్రామంలో ఎంపీడీవో రాంలు శనివారం పర్యటించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మహిళా డ్వాక్రా సంఘాల భవనాన్ని త్వరీతగతంగా పూర్తిచేయాలని సర్పంచ్ కు సూచించారు. నర్సరీలో మొక్కలను పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా స్థలాలను గుర్తించి నాటాలని మొక్కల పెంపుదల చేయాల ని సర్పంచ్ కు సూచించారు. ఉపాధి హామీలో భాగంగా గ్రామంలో మంజూరైన ఫార్మిషన్ రోడ్డును పరిశీలించా రు. ఉపాధి పథకంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్డును వాటర్ ట్యాంక్ లను, మినీ ట్యాంకులను పరిశీలించారు. వర్షాల కారణంగా దోమల ప్రబలకుండా శానిటైజేషన్ చేయాలని చూచించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి ఇండ్లను త్వరితగతిన నిర్మించాలని తెలిపారు. పూర్తి చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను అభినందించారు. అంగన్ వాడీన్ని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టీచర్ లకు సూచించారు. కార్యక్రమంలో బోపునారం సర్పంచ్ నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యశ్వంత్,ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరుతుంది!



**నవాబుపేట్ జూలై 5( జనం సాక్షి) :** నవాబ్ పెట్ మండలం పులుమామిడి గ్రామాలలో తెలుగు బాలమని అనంతయ్య నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఘనంగా ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షుడు సామ వెంకటరెడ్డి వికారాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈకార్యక్రమంలో.పులుమామిడి గ్రామ , దాన నర్సింలు, ఉప సర్పంచ్ నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు పులగుర్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్కమిటీ వైస్ చేర్మెన్ కర్ణం రఘు, ఇమ్రాన్ ఖాన్, పడమటి గోపాలరెడ్డి, శ్రీనివాస్,తెలుగు రుక్మయ్య,రవి, శ్రీనివాస్, నర్సింలు, సత్యనారాయణ,మల్లేశం, రాజు, అరవిందు వివిధ గ్రామాల పంచాయితీ వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులుకాంగ్రెస్ పార్టీ సీనియర్ గ్రామ వార్డు మెంబర్లు,సీనియర్ నాయకులు , స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ,గ్రామ యువకులు గ్రామ పెద్దలు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ



**నవాబుపేట్ జూలై 5( జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, అలాగే నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత ( సి ఎస్ ఆర్ ) కార్యక్రమంలో భాగంగా సైబేజ్ ఆశ ద్వారా విద్యా సామగ్రిని పంపిణీ చేసింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు మరియు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, డ్రాయింగ్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, క్రయాన్ బాక్స్‌లు, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సైబేజ్ ఆశ సీనియర్ సి.ఎస్.ఆర్. ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో సైబేజ్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబేజ్ ఆశ ప్రతినిధులు అనపురపు సురేష్,తిరుపతి, కృష్ణ చైతన్య, సాయి ప్రసాద్, సంతోష్, బాపిరాజు, రాజశేఖర్, గౌతమి, రాజశ్రీ, అక్షయ,నాగిరెడ్డిపల్లి సర్పంచ్ శేఖర్, ఉపసర్పంచ్ ది రాత్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీలత, గ్రామస్థులు ముకుంద్ రెడ్డి , బుచ్చయ్య, కృష్ణారెడ్డి, హనుమంత్ రెడ్డి,తిరుపతిరెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# శామీర్ పేట్ 300 డివిజన్ అధ్యక్షున్ని ఏక పక్షంగా నియమించడం శోచనీయం



**శామీర్ పేట్, జూలై 05(జనం సాక్షి) :** ఇటీవల శామీర్‌పేట్ 300 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుని నియామకాన్ని పురస్కరించుకుని తూంకుంటలో డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుని నియామకానికి ముందు స్థానిక కాంగ్రెస్ నాయకు లతో,కార్యకర్తలతో ఎలాంటి సంప్రదింపులు జరప కుండా అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు.పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలంటే కార్యకర్తల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ అంశాన్ని పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమా వేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ తో సమావేశమై డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుని నియామకంపై కార్యకర్తల అభి ప్రాయాలు, మనోభావాలను వివరించి,తగిన నిర్ణయం తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఐక్యత, కార్యకర్తల గౌరవం,సంస్థాగత బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమని, అధిష్ఠానం స్థానిక నాయకులు,కార్యకర్తల అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకుని న్యాయమైన నిర్ణయం తీసుకుంటుందనే విశ్వాసాన్ని సమావేశంలో నాయకులు వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్ టి ఏ మెంబర్ జైపాల్ రెడ్డి,నాయకులు మధు సూదన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా సరికొండ అనంతరెడ్డి

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను**



**మొయినాబాద్, జూలై 04, జనం సాక్షి :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా సరికొండ అనంతరెడ్డిని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా నియమించింది. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, సేవలను గుర్తించి అధిష్ఠానం ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.నియామకంపై స్పందించిన సరికొండ అనంతరెడ్డి, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు.ఆయన నియామకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సరికొండ అనంతరెడ్డి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసే క్రమంలో వివిధ స్థాయిల్లో కీలక పదవుల నియామకాలు కొనసాగుతున్నాయి.

# బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్త మృతి తీరని లోటు

**సరదా నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమ్మరి రాము**




**మొయినాబాద్.జూలై 05 (జనంసాక్షి) :** బి బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు ఎంకేపల్లి గ్రామ కార్యకర్త డబ్బు కరంచంద్ మృతి పార్టీకి తీరని లోటని ఆయన పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని సరదా నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జీవన్ కూడా రాము ఎంకేపల్లి గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చాకలి శ్రీనివాస్ లు పేర్కొన్నారు. ఆదివారము ఎనకపల్లి గ్రామంలో డప్పు కరంచంద్ దశదినకర్మ సందర్భంగా ఎంకేపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు వారి కుటుంబానికి లక్ష రూపాయల సహాయ ఆర్థిక అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ ఎన్కెపల్లి గ్రామంలో డప్పు కరంచంద్ తనదైన శైలిలో పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీ నాయకులను గ్రామస్తులను ఎంతో బాధకు కలిసిందని అన్నారు పార్టీలో కష్టపడి పనిచేస్తున్న వ్యక్తులు ఇలాంటి సంఘటనలకు గురై మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు వారి కుటుంబం అన్ని విధాలుగా ఉండేందుకు రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ అధినాయకులు కేటీఆర్ కుటుంబాన్ని ఆదుకుంటా మని తెలిపినట్లు సూచించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సుకూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నాలాలో చెట్ల తొలగింపు, ప్రజలకు ఊరట

**జనంసాక్షి కథనానికి స్పందించిన అధికారులు..**


ప్రజల ప్రాణాలకు బాధ్యత ఎవరిది?
నాలాలు శుభ్రం చేయలేని ఇంజినీరింగ్ శాఖ... 20 రోజులుగా నాలా బంద్
జనంసాక్షి
03 Jul 2026 - Page 1
https://epaper.janamsakshi.org/clip/509913

**కూకట్‌పల్లి జూలై 5(జనంసాక్షి ):** జనంసాక్షిలో వరుసగా ప్రచురితమైన కథనాలకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. దాదాపు 20 రోజులుగా నాలాలో చెట్లు విరిగి పడటంతో నీటి ప్రవాహం నిలిచిపోయి, వర్షం వస్తే సమీప కాలనీలు ముంపు ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను జనంసాక్షి వెలుగులోకి తీసుకురావడంతో ఇంజినీరింగ్ అధికారులు వెంటనే స్పందించి నాలాలో అడ్డంగా పడిన చెట్లు, కొమ్మలను తొలగించారు.దీంతో నాలాలో నీటి ప్రవాహం పునరుద్ధరించబడింది. వర్షాకాలంలో ఎదురయ్యే ముంపు ప్రమాదం నుంచి స్థానికులకు ఉపశమనం లభించింది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఇంజినీరింగ్ అధికారులను స్థానికులు అభినందించారు.అయితే, నాలాల వెంట పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించి, నాలాను శాశ్వతంగా శుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలం దృష్ట్యా నాలాల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.







# కార్మికుల ఐక్యతకు దక్కిన విజయం : రెబ్బ రామారావు

**శామీర్ పేట్, జూలై 05(జనం సాక్షి ) :** భాగ్యనగర్ గ్యాస్ డ్రైవర్ల కనీస వేతనాల డిమాండ్ల సాధన భాగ్యనగర్ గ్యాస్ డ్రైవర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్‌కు చెందిన 150 మంది డ్రైవర్లు, కార్మికులు గత 15 ఏళ్లుగా అందిస్తున్న సేవలను గుర్తిస్తూ, వారి న్యాయమైన హక్కులు మరియు కనీస వేతనాల కోసం గత 5 నెలలుగా సాగించిన ఉధృత పోరాటం ఎట్టకేలకు విజయ వంతమైందని హెచ్ ఎం ఎస్ అధ్యక్షులు రెబ్బ రామారావు అన్నారు. విద్యానగర్‌లోని సెంట్రల్ లేబర్ కమిషనర్ ఆఫీస్‌లో జరిగిన చర్చలలో కార్మికుల ప్రధాన డిమాండ్లు మరియు కనీస వేతనాల ఒప్పందం అధికారికంగా ఆమోదం పొందింది.ఈ చారిత్రాత్మక విజయానికి అండగా నిలిచి, సంపూర్ణ సహకారం అందించిన హెచ్.ఎమ్.ఎస్ నాయకత్వానికి యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించిన హెచ్ ఎం ఎస్ ప్రెసిడెంట్ రెబ్బ రామారావు , వర్కింగ్ ప్రెసిడెంట్ దప్పు సాయి బాబా , జనరల్ సెక్రటరీ భూమిగారి చంద్రశేఖర్, యూనియన్ ప్రతినిధులు రమేష్, పద్మ రెడ్డి, శంకర్ నాయక్, నరేందర్, సుధాకర్ రెడ్డి, మహేష్, కార్మికులందరూ సమైక్యంగా నిలిచి ఈ హక్కులను సాధించుకున్నారు.ఈ శుభ సందర్భంగా ప్రెసిడెంట్ రెబ్బ రామారావు మాట్లాడుతూ... కార్మికుల ఐక్యతకు దక్కిన విజయమిదని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన మ్యాన్ పవర్ ఉద్యోగుల డిమాండ్లను కూడా త్వరలోనే సాధించుకుంటా మని హామీ ఇస్తూ, విజయం సాధించిన కార్మికులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేవుని ఎర్రవల్లి 3వ వార్డు దర్గాకు బోరు ఏర్పాటు



చేవెళ్ల, జూలై 05 (జనంసాక్షి) చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు దేవుని ఎర్రవల్లి వార్డులోని ముస్లిం మైనార్టీ రోజా, దర్గా కమిటీ ఆధ్వర్యంలో దర్గాకు తాగునీటి సౌకర్యార్థం బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎదిరే చంద్రయ్య పాల్గొని బోరు ఏర్పాటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్గాను సందర్శించే భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ బోరు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సామాజిక ఐక్యతకు, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ రోజా, దర్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వాగతించి కమిటీ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కరికే మల్లేశం, ఎదిరే ఐక్కయ్య, హరిజన్ శివయ్య, ఎండీ జావీద్, గౌస్, ఫకీర్ సాబ్, ఎదిరే యాదయ్య, బస్వేపురం వెంకటయ్య,,కంకంటి బాలయ్య, ఎర్రవల్లి మాణిక్యం రెడ్డి, ఎండీ నాసిర్ ఖాన్, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని దశలవారీగా అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

**బాకారం జాగీర్‌లో HMDA నిధులతో సీసీ రోడ్డు పనులు**

**గ్రామ అభివృద్ధికి సర్పంచ్ ఎల్లని వెంకటేష్ గౌడ్ హామీ**



**మొయినాబాద్, జూలై 4 (జనం సాక్షి):** గ్రామాన్ని దశలవారీగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని బాకారం జాగీర్ గ్రామ సర్పంచ్ ఎల్లని వెంకటేష్ గౌడ్ అన్నారు. మండలంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో నవీనా నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా వార్డు సభ్యులు, గ్రామస్థుల సహకారంతో అందరితో కలిసి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు బంది అనిల్, ఉపేందర్ యాదవ్, కొండకల్ల రవి, మది దినేష్ రెడ్డి, భిక్షపతి గౌడ్, కొండకల్ల శ్రీకాంత్, కొండకల్ల మహేందర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.